సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం ॥ 29 ॥ జూలై ॥ 2025



..ఆవాసం ఉండేనా !

జిల్లా అటవీ ప్రాంతంలో ఆరునెలలుగా సంచరిస్తున్న పులి అడవి దాటి వలస వెళ్లకుండా అధికారులు ప్రయత్నిస్తున్నారు. 8లో



వర్షాలు.. సస్యరక్షణ

భారీ వర్షాల నేపథ్యంలో రైతులు రసాయన ఎరువులను వాడొద్దని, పంటల్లో జాగ్రత్తలు పాటించాలని కేవీకే శాస్త్రవేత్తలు అంటున్నారు. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
32° / 25°

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రామయ్యకు వెండి శఠారి వితరణ

భద్రాచలంటౌన్: పట్టణానికి చెందిన సంకా రామచంద్రమూర్తి – శశిదేవి దంపతులు శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి రూ.60 వేల విలువైన 485 గ్రాముల వెండి శఠారిని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు స్వామివారిని దర్శించుకోగా, ఆలయ ఈఓ ఎల్.రమాదేవి వారికి స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం అందించారు.

పత్తిలో మునగ నాటండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): పత్తి తోటల్లో చెట్ల మధ్య మునగ సాగు చేయడంతో లాభాలు రెట్టింపు చేసుకోవచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్ రైతులకు సూచించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత సంవత్సరం నిర్వహించిన అవగాహనా కార్యక్రమాలతో జిల్లాలో దాదాపు 100 ఎకరాల్లో మునగ సాగు చేపట్టారని పేర్కొన్నారు. పత్తిలో అంతరపంటగా మునగ వేసిన రైతుల సంఖ్య పెరిగిందని, సాగు 300 ఎకరాలకు చేరుకుందని తెలిపారు. ప్రస్తుతం నాటిన పత్తి జనవరి – ఫిబ్రవరి మధ్య దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా రైతులు మునగ విత్తనాలు పొందొచ్చని, ఇంటి వద్దే మట్టి, ఎరువుతో కలిపి విత్తనాలు వేస్తే రెండు, మూడు నెలల్లో మొక్కలు తయారవుతాయని తెలిపారు.

ప్రజావాణికి తగ్గిన ఫిర్యాదులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. వర్షాలు కురిసి, వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో పాటు ఇతర పనుల రీత్యా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రజావాణికి సక్రమంగా రాకపోవడం కూడా మరో కారణమని అంటున్నారు. కాగా, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. తన ఇల్లు గత ఫిబ్రవరిలో షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయినందను ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని జూలూరుపాడు మండలం సాయిరాం తండాకు చెందిన గుగులోత్ వీరూ, మెడికల్ కాలేజీ ఏర్పాటుతో తన కున్న 1.20 ఎకరాల భూమి పోకుండా చూడాలని మణుగూరుకు చెందిన బత్తుల రాములు, కొత్తగూడెం, రామవరంలో ఎలక్ట్రానిక్ ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు బానోత్ రాజ్‌కుమార్, ఎస్‌కే అయూబ్, పురుషోత్తం, సురేష్ అందించిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు.

కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించాలి



మాట్లాడుతున్న జయలక్ష్మి


కొత్తగూడెంఅర్బన్ : కంటి శుక్లానికి సంబంధించిన సమస్యలు ఉన్నవారిని గుర్తించాలని డీఎంహెచ్ఓ ఎస్.జయలక్ష్మి సిబ్బందికి సూచించారు. తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బాధితులను గుర్తించి, శస్త్రచికిత్స కోసం సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ రవిబాబు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దోస్త్‌లో ఎర్త్ సైన్సెస్

కొత్తగూడెంలోని ప్రతిష్టాత్మక డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల కోసం ఉద్దేశించిన దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) వెబ్‌సైట్‌లో ఈ కాలేజీని చేర్చారు. ఎర్త్ సైన్సెస్‌కు సంబంధించి నాలుగు కోర్సులు ఇక్కడ ప్రవేశపెట్టాలని ముందుగా నిర్ణయించగా, ప్రస్తుతానికి జియాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సులకే అవకాశం కల్పించారు. ఒక్కో విభాగంలో 60 సీట్ల చొప్పున తొలి ఏడాది 120 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వనున్నారు. ఇక్కడ కో ఎడ్యుకేషన్‌లో బోధన కొనసాగనుంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం





యూనివర్సిటీలో కొనసాగుతున్న సర్వే పనులు (ఇన్‌సెట్) దోస్త్ వెబ్‌సైట్ ఆప్షన్లలో మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ

యూనివర్సిటీలో ప్రవేశాలు ప్రారంభం

- దోస్త్ వెబ్‌సైట్‌లో డాక్టర్ మన్మోహన్ వర్సిటీకి స్థానం
- అందుబాటులో రెండు డిగ్రీ కోర్సులు
- రూ.500 కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపకల్పన

పాత భవనాలను పునరుద్ధరించి..

కొత్తగూడెంలో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీని ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా మారుస్తున్నట్టు మార్చి 27న సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. అనంతరం ఈ విశ్వవిద్యాలయానికి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా జూన్ 5న నామకరణం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 30న వైస్ చాన్స్‌లర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి యోగితా రాణాను నియమించారు. జూలై చివరి వారం నాటికి అడ్మిషన్లు కూడా మొదలయ్యాయి. పాత ఇంజనీరింగ్ కాలేజీ (కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్)కి సంబంధించిన భవనాలను ఇటీవల పునరుద్ధరించారు. ఇక్కడ తాత్కాలిక ప్రాతిపదికన డిగ్రీ కోర్సులను ప్రారంభించనున్నారు. తెలంగాణలో మొత్తం 11 యూనివర్సిటీలు ఉండగా స్పెషలైజ్డ్ కోర్సులు అందించే వర్సిటీలు నాలుగే ఉన్నాయి. అందులో మన్మోహన్‌సింగ్ యూనివర్సిటీ ఒకటి కావడం విశేషం.

రూ.500 కోట్లతో అభివృద్ధి..

గడిచిన దశాబ్ద కాలంగా ఈ యూనివర్సిటీ క్యాంపస్‌లో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. ల్యాబ్‌లు, తరగతి గదులు, ఇండోర్ స్టేడియం, బాలుర హాస్టల్, మెస్ వంటివి పురాతన భవనాల్లో కొనసాగుతున్నాయి. వర్షం వస్తే కురుస్తున్నాయి. ప్రహరీ లేక ప్రధాన రహదారి వైపు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. సువిశాలమైన ప్రాంగణాన్ని పట్టించుకోకపోవడంతో క్యాంపస్ అంతా దట్టమైన అడవిలా మారిపోయింది. పాముల సంచారం ఎక్కువగా ఉంది. అయితే ఇప్పుడు యూనివర్సిటీ స్థాయికి అప్‌గ్రేడ్ కావడంతో ఆ మేరకు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఏర్పడింది. దీనికి తోడు దేశంలో ఎర్త్ సైన్సెస్ కోర్సులు అందిస్తున్న ఏకైక యూనివర్సిటీ కావడంతో రూ. 500 కోట్లతో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వర్సిటీ క్యాంపస్‌ను తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఈ మేరకు మాస్టర్ ప్లాన్ రూపొందించే పనిలో ఉన్నత విద్యాశాఖ అధికారులు ఉన్నారు. ఈ మేరకు ప్రత్యేక కమిటీని కూడా నియమించారు.

హద్దులు సరిచేస్తున్నారు..

కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్‌గా 1974లో ఈ కాలేజీ మొదలైనప్పుడు క్యాంపస్ 410 ఎకరాల్లో విస్తరించి ఉండేది. అయితే కాలక్రమంలో కొంత ఆక్రమణలకు గురికాగా 85 ఎకరాలు వివిధ ప్రభుత్వ అవసరాల కోసం తీసుకున్నారు. దీంతో ప్రస్తుతం యూనివర్సిటీ 310 ఎకరాల్లో ఉన్నట్టుగా రికార్డులు చెబుతున్నాయి. కానీ వాస్తవంగా అంత స్థలం ఇప్పటికీ ఉందా, అటవీ శాఖలో ఏమైనా కలిసిందా అనేది తెలియదు. అలాగే కాలేజీ స్థలంలోనే ఐడీఓసీ, మెడికల్ కాలేజీ, ఎస్పీ ఆఫీసులు ఉన్నాయి. వీటి మధ్య ఎక్కడా కచ్చితమైన సరిహద్దులు లేవు. దీంతో ప్రస్తుతం క్యాంపస్ ఎన్ని ఎకరాల్లో విస్తరించి ఉంది.. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా ఇంకా ఏమైనా భూసేకరణ చేయాల్సిన అవసరం వస్తుందా అనే అంశాలపై ప్రస్తుతం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు.

నిధుల సేకరణ

ఈ వర్సిటీ సేవలను భవిష్యత్‌లో ఉపయోగించుకోబోయే సింగరేణి, ఎన్ఎండీసీ, టీఎస్ఎండీసీ వంటి సంస్థల నుంచి కూడా నిధులు సేకరించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. కాగా, ఈ కాలేజీలో అత్యవసర మౌలిక సదుపాయాల కల్పనకు రూ.51.31 కోట్లు అవసరమని 2023 ఫిబ్రవరిలో నిపుణుల కమిటీ సిఫార్సు చేసినా ఇంత వరకు అమలుకు నోచుకోలేదు. మరోవైపు ఈ యూనివర్సిటీకి చెందిన 85 ఎకరాల స్థలాన్ని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయం, ఎస్పీ ఆఫీస్, మెడికల్ కాలేజీల కోసం ప్రభుత్వం తీసుకుంది. ఇందుకు పరిహారంగా రూ.168 కోట్లు డాక్టర్ మన్మోహన్ సింగ్ యూనివర్సిటీకి (ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ, కొత్తగూడెం) చెల్లించాలని నాలుగేళ్ల క్రితమే నిర్ణయించారు. ఈ రెండూ కలిపి సుమారు రూ.220 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది.

పదోన్నతుల ప్రక్రియకు రంగం సిద్ధం

- నేడు నోటిఫికేషన్ వచ్చే అవకాశం !
- జాబితా రూపొందిస్తున్న విద్యాశాఖ అధికారులు
- జీహెచ్‌ఎం, పీఎస్‌హెచ్‌లకు నేరుగా అవకాశం
- మిగిలిన వారికి శాతాలుగా విభజించి ప్రమోషన్లు



తరగతి గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో అర్హత ఉండి ఎదురుచూస్తున్న టీచర్లలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమోషన్లకు సంబంధించిన నోటిఫికేషన్ మంగళవారం జారీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జాబితాలు సిద్ధం చేసే పనిలో జిల్లా విద్యాశాఖాధికారులు నిమగ్నమయ్యారు. గతేడాది కూడా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించగా, మిగిలిన వారికి ఈ ఏడాది అవకాశం ఇస్తారు. జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో పని చేసే ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి హైస్కూళ్లలో బోధించే అవకాశం కల్పిస్తారు. ఇప్పటికే ఎస్‌ఏలుగా ఉన్న వారికి హెచ్‌ఎంలుగా ప్రమోషన్లు ఇస్తారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు(జీహెచ్‌ఎం), పీఎస్ హెచ్‌ఎంలకు నేరుగా పదోన్నతులు కల్పిస్తుండగా, ఎస్జీటీలు, ఎస్‌ఏలకు మాత్రం 70 – 30 శాతంగా విభజించి ప్రమోషన్లు ఇస్తారు. ఉదాహరణకు 10 ఖాళీలుంటే ఏడుగురికి పదోన్నతులు కల్పించి, మిగిలిన మూడింటిని డీఎస్సీ రిక్రూట్‌మెంట్ కోసం ఖాళీలుగా చూపిస్తామని జిల్లా విద్యాధికారులు వెల్లడించారు. పదోన్నతులు వచ్చిన ఉపాధ్యాయులకు హోదాతో పాటు వేతనాలూ పెరగనున్నాయి. వారికి రెండు ఇంక్రిమెంట్లు జత కానున్నట్లు తెలుస్తోంది. హోదాతో పాటు వేతనం పెంపుతో అర్హత గల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పదోన్నతులు ఇలా..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లకు సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించనున్నారు. మొదట ఉపాధ్యాయుల సర్టిఫికెట్లు పరిశీలించి, మల్టీజోన్ –1 లో అర్హత గల వారి పేర్లు ప్రకటిస్తారు. సవరణలు, అభ్యంతరాల స్వీకరణకు రెండు రోజులు గడువు ఇస్తారు. ఆ తర్వాత తుది జాబితా ప్రకటిస్తారు. అనంతరం వెబ్ ఆప్షన్లు ఇవ్వడం, ఎడిట్ చేయడం, ఆప్షన్ల ప్రకారం కేటాయింపు ప్రక్రియ ఉంటుంది. సీనియారిటీ ప్రకారం గతేడాది సెప్టెంబర్‌లో పదోన్నతుల ప్రక్రియ జరుగగా, ఈ ఏడాది ఆగస్టులోనే పూర్తయ్యే అవకాశం ఉంది.

జిల్లాలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఖాళీలు ఇలా..

ఎస్‌జీటీ కేటగిరీ	ఖాళీలు
పీఎస్ హెచ్‌ఎం	20
లాంగ్వేజ్ పండిట్లు(తెలుగు, హిందీ)	05
ఎస్‌జీటీ(స్పెషల్ ఎడ్యుకేషన్) (తెలుగు)	14
ఎస్‌జీటీ(తెలుగు)	329
ఎస్‌జీటీ(ఉర్దూ)	03
క్రాఫ్ట్ టీచర్	12
క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్	03
ఆర్ట్, డ్రాయింగ్ టీచర్లు	07
ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్	02
మ్యూజిక్ టీచర్	01
ఎస్‌ఏ కేటగిరీ	**ఖాళీలు**
జీహెచ్‌ఎం	20
ఎస్‌ఏ(తెలుగు, హిందీ, ఇంగ్లిష్ విభాగాలు)	118
ఎస్‌ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్)	07
ఎస్‌ఏ (ఫిజికల్ సైన్స్)	14
ఎస్‌ఏ (స్పెషల్ ఎడ్యుకేషన్)	18
ఎస్‌ఏ (ఎస్ఎస్ తెలుగు)	34

పదోన్నతులు హర్షణీయం



ఉపాధ్యాయుల పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయం. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కంకణం కట్టుకున్న సర్కారు.. బోధన కూడా మెరుగుపర్చే ప్రక్రియలో పదోన్నతుల నిర్ణయం తీసుకుంది.

–డి.వి.సత్యనారాయణరెడ్డి, ఉపాధాయుడు, జెడ్పీహెచ్ఎస్ పాల్వంచ

కేంద్ర బృందం పర్యటన

చుంచుపల్లి: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ – 2025 సర్వేలో భాగంగా కేంద్ర బృందం సభ్యులు సోమవారం చుంచుపల్లి తండా, పెనగడపలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్ సెంటర్లు, ప్రాథమిక ఉన్నత పాఠశాలలను సందర్శించారు. మరుగుదొడ్ల సదుపాయాలు, కంపోస్ట్ ఎరువుల తయారీ, తడి చెత్త, పొడిచెత్త నిర్వహణ విధానంపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుభాషిని, రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్ జయంత్, ఎస్‌బీఎం జిల్లా కో–ఆర్డినేటర్ రేవతి, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, రమేష్, రఘు పాల్గొన్నారు.



చుంచుపల్లి తండాలో వివరాలు సేకరిస్తున్న సభ్యులు

గిరిజన మ్యూజియం సందర్శన..

భద్రాచలంటౌన్: భద్రాచలంలో ఏర్పాటు చేసిన గిరిజన మ్యూజియాన్ని మరొక కేంద్ర బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు గిరిజనుల కళాఖండాలు, పెయింటింగ్‌లను తిలకించారు. అనంతరం మాట్లాడుతూ.. అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు నేటి తరానికి, పర్యాటకులకు తెలిసేలా కళాఖండాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పాతతరం గిరిజనులు వినియోగించిన పనిముట్లు, గిరిజన వంటకాలు చాలా అద్భుతంగా ఉన్నాయని అన్నారు. మిల్లెట్ బిస్కెట్ల తయారీ కేంద్రాన్ని సందర్శించి, బిస్కెట్ల తయారీకి వాడుతున్న ఆహార పదార్థాల గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాని నరేంద్రమోడీ మిల్లెట్ బిస్కెట్ల ప్రాముఖ్యత గురించి మన్ కీ బాత్‌లో ప్రజలందరికీ తెలిసేలా చెప్పడంతో భద్రాచలం పేరు లండన్ వరకు పాకిందని, బిస్కెట్ల తయారీకి పీఓ రాహుల్ సహకారం అభినందనీయమని అన్నారు. అనంతరం రూ.3 వేల విలువైన బిస్కెట్లను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మ్యూజియం నిర్వాహకులు వీరస్వామి, అధికారులు ప్రభాకర్ రావు, అపర్ణ, మాధవి పాల్గొన్నారు.

జీవనోపాధికే దరఖాస్తు చేయాలి

గిరిజన దర్బార్‌లో పీఓ రాహుల్

భద్రాచలం : గిరిజన దర్బార్‌లో ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన దరఖాస్తులు ఇవ్వకూడదని, స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధికి మాత్రమే వినతులు అందించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోడు భూముల పట్టాలు, పేర్ల మార్పు, రైతుబంధు, మీసేవా కేంద్రాల ఏర్పాటుతో జీవనోపాధి, గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం వంటి వాటిపైనే దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయని వివరించారు. వాటిని ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి అర్హులైన ప్రతీ ఒక్కరికీ విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని, వారి జీవనోపాధికి తప్పకుండా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏఓ సున్నం రాంబాబు, ఈఈ హరీష్, అధికారులు లక్ష్మీనారాయణ, భాస్కర్, వేణు, రాజారావు, ఆదినారాయణ, హరికృష్ణ, అనసూయ, నరేందర్, భార్గవి, ప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ రాహుల్

బీఈడీ ప్రవేశాల మెరిట్ జాబితా..

భద్రాచలంటౌన్ : భద్రాచలం బీఈడీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం మెరిట్ జాబితా తయారు చేశామని పీఓ రాహుల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో 50 సీట్ల భర్తీకి 940 విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, జాబితాలో పేరు ఉన్నవారు ఈనెల 31న ఉదయం 10 గంటలకు భద్రాచలం బీఈడీ కళాశాలలో జరిగే మొదటి విడత కౌన్సిలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

సాగులో సాంకేతికత !

- పంటల సేద్యంలో డిజిటల్ టెక్నాలజీ
- యాప్‌లు, వాట్సాప్‌తో నూతన విధానంలో మెళకువలు
- విత్తనాల ఎంపిక నుంచి పంటల అమ్మకం వరకు..



పత్తిలో తెగులును యాప్‌లో నమోదు చేస్తున్న రైతు

బూర్గంపాడు: పంటల సాగులో నూతన సాంకేతిక విధానాలు బాగా ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా డిజిటల్ టెక్నాలజీ వినియోగం నానాటికీ పెరుగుతోంది. భూమి సంరక్షణ నుంచి విత్తన ఎంపిక, చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యం, పంటల మార్కెటింగ్ వంటి అనేక అంశాల్లో రైతులు డిజిటల్ టెక్నాలజీతో ముందుకు సాగుతున్నారు. పంటల సాగులో కీలకమైన వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు డిజిటల్ యాప్‌లను అనుసరిస్తున్నారు. ఈ యాప్‌లను స్మార్ట్‌ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకుని బాగా వినియోగిస్తున్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలతో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి పంటల సాగులో శాస్త్ర, సాంకేతిక విధానాలపై అవగాహన పెంచుకుంటున్నారు. రైతు వేదికల్లో నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌లు కూడా వారిని ఆలోచింపజేస్తున్నాయి.

ఉచితంగా సలహాలు, సూచనలు..

పంటల్లో చీడ పీడల నివారణ చర్యల కోసం ఇక్రిశాట్ ప్లాంటిక్స్ యాప్‌ను రైతులకు అందుబాటులోకి వచ్చింది. స్మార్ట్‌ఫోన్‌లో ఈ యాప్‌ను ఓపెన్ చేసి పంటలకు ఆశించిన చీడపీడలను ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే వెంటనే తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను ఈ యాప్ వివరిస్తుంది. వివిధ అంతర్జాతీయ కంపెనీల యాప్‌లు రైతులకు పంటల సాగులో చేపట్టాల్సిన జాగ్రత్తలపై ఉచితంగా సలహాలు, సూచనలు అందిస్తున్నాయి. వాతావరణ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేస్తూ రైతులను అప్రమత్తం చేసే అనేక యాప్‌లు కూడా ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. వర్షం ఎప్పుడు కురుస్తుంది, తమ ప్రాంతానికి ఎంత దూరంలో వర్షం పడుతోంది అనే విషయాలను కూడా ఈ యాప్‌లు వివరిస్తున్నాయి. పొలం పనులు చేస్తున్న సమయంలో పిడుగులు పడే సమాచారాన్ని కూడా కొన్ని యాప్‌లు తెలియజేస్తున్నాయి.

భవిష్యత్‌లో మరింత ప్రభావం..

పంటల మార్కెటింగ్‌కు సంబంధించి కూడా కొన్ని యాప్‌లు, వాట్సాప్ గ్రూప్‌లు రైతులను అప్రమత్తం చేస్తున్నాయి. దేశీయ, అంతర్జాతీయ, స్థానిక మార్కెట్లలో ఏ పంటకు ఎంత ధర పలుకుతోందనే వివరాలను ఏరోజుకారోజు అప్‌డేట్ చేస్తున్నాయి. ఈ నామ్ యాప్ ద్వారా దేశంలో, రాష్ట్రంలో ఏ మార్కెట్‌లో ఏ పంటకు ఎంత ధర దక్కిందనే సమాచారం అందుతోంది.

పెరిగిన యాంత్రీకరణ..

ప్రస్తుతం వ్యవసాయంలో యాంత్రీకరణ కీలకంగా మారింది. పశుపోషణ భారంగా మారడం, కూలీల కొరతను అధిగమించేందుకు రైతులు పంటల సాగుకు గత ఇరవై ఏళ్లుగా యాంత్రీకరణపై దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం యాంత్రీకరణతో పాటు డిజిటల్ టెక్నాలజీ కూడా పెరుగుతోంది. భూముల స్వభావం నుంచి విత్తనాల ఎంపిక, విత్తన నాణ్యత, వాటి ధరలు వంటి అనేక అంశాలను యాప్‌లు, వాట్సాప్ గ్రూప్‌లు తెలియజేస్తున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందిన విత్తన కంపెనీలు, పెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్ కంపెనీలు కొత్త కొత్త యాప్‌లను రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. పంటలను ఆశించే చీడపీడల నివారణకు ఎలాంటి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలనే సమగ్ర సమాచారాన్ని ఆ యాప్‌ల ద్వారా తెలుసుకుంటున్నారు. అంతేకాక పంటల ప్రస్తుత పరిస్థితి ఎలా ఉందో ఫొటోలు, వీడియో తీసి ఆయా యాప్‌లకు పంపిస్తే తక్షణం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తున్నారు.

సింగరేణిలో ఘనంగా వన మహోత్సవం

204 మొక్కలు నాటిన సీఎండీ బలరామ్



మొక్కలు నాటుతున్న బలరామ్ తదితరులు

సింగరేణి(కొత్తగూడెం) : కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని ఇల్లెందు గెస్ట్ హౌస్‌లో సోమవారం నిర్వహించిన వన మహోత్సవంలో సీఎండీ ఎన్.బలరామ్ పాల్గొని 204 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఒక్కడినే ఏడేళ్లలో 19,904 మొక్కలు నాటానని తెలిపారు. సింగరేణిలో పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో సమీప గ్రామాలు, మైన్లు, డిపార్ట్‌మెంట్లతో పాటు ఓబీ డంప్‌లలో మొక్కలు నాటుతున్నామని వివరించారు. సింగరేణి ఆధ్వర్యంలో ఇప్పటివరకు 15,231 హెక్టార్లలో 5.47 కోట్ల మొక్కలు నాటామని, సమీప గ్రామాలకు 2.29 కోట్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు. ఈ సంవత్సరం 6.75 హెక్టార్లలో 40 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదాలపై అవగాహన కల్పించాలి



సిబ్బంది కిట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ విక్రాంత్

భద్రాచలంఅర్బన్: రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సూచించారు. సోమవారం ఆయన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో పరిసరాలను, రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేకూర్చాలని, బాధ్యతగా మెలగాలని చెప్పారు. సైబర్ నేరాల బారిన పడకుండా పట్టణ ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా ఠాణాలో మొక్కలు నాటారు. ట్రాఫిక్ ఎస్‌ఐ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర కమిటీ సభ్యుడిగా లక్ష్మణరావు



కొమరం లక్ష్మణరావు

మణుగూరు టౌన్: అఖిల భారతీయ ఆదివాసీ వికాస్ పరిషత్ కేంద్ర కమిటీ సభ్యుడిగా మణుగూరుకు చెందిన కొమరం లక్ష్మణ్‌రావును నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు శంకర్ బోదత్ నియామక పత్రం అందజేశారు. ఆదివాసీల అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా లక్ష్మణరావు తెలిపారు.

పీకే ఓసీలో నూతన యంత్రాలు..



యంత్రాలను ప్రారంభిస్తున్న ఏరియా జీఎం దుర్గం రాంచందర్

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలోని పీకే ఓసీలో రూ.9.32 కోట్ల విలువైన భారీ క్రేన్, షావల్‌ను సోమవారం జీఎం దుర్గం రాంచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్రాల వినియోగంపై అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. భారీ యంత్రాలను నడిపేందుకు సీనియర్లకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసచారి, శ్రీనివాస్, లక్ష్మీపతిగౌడ్, వెంకటరామారావు, రాంబాబు, అనురాధ, శివ ప్రసాద్, వీరభద్రుడు, ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

ఆతిథ్యం మెచ్చి.. ఆవాసం ఉండేనా!

- జిల్లా అటవీ ప్రాంతంలో ఆరు నెలలుగా పులి సంచారం!
- కొన్నేళ్లుగా అతిథిలా వచ్చిపోతున్న జాతీయ జంతువు
- ఆవాసం ఏర్పాటు చేసుకునేలా అటవీశాఖ ప్రయత్నాలు
- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం



జిల్లా అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పులి భద్ర (ఫైల్)

పాల్వంచరూరల్: అడవిలో అలజడి ఉంటే పులి అక్కడి నుంచి మరోప్రాంతానికి వెళ్లిపోతుందని, నిశబ్దంగా ఉండే అటవీప్రాంతంలోనే ఆవాసం ఏర్పాటు చేసుకుంటుందని వైల్డ్‌లైఫ్ అధికారులు చెబుతున్నారు. జిల్లా అటవీ ప్రాంతంలో ఆరునెలలుగా పులి (భద్ర) సంచరిస్తోంది. జాతీయ జంతువు అడవి దాటి వలస వెళ్లకుండా అటవీ శాఖ ప్రయత్నాలు చేస్తోంది. గతంలో జిల్లా అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు పులులను వేటాడి చంపిన దాఖలాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పులి భద్రమేనా అనేది చర్చనీయాంశంగా మారింది.

అతిథిలా వచ్చిపోతోంది..

కేంద్ర ప్రభుత్వం 1975లో కిన్నెరసాని అభయారణ్యం ఏర్పాటు చేసింది. దీని విస్తీర్ణం 634.4 చదరపు కిలోమీటర్లు ఉంది. ఇక్కడ జింకలు, కొండ గొర్రెలు, సాంబర్లు, దున్నలు, చుక్కల దుప్పులు, అడవి పందులు, కుందేళ్లు, ఎలుగుబంట్లు, నక్కలు, తోడేళ్ల వంటి జంతువులు అధికంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా పది లక్షల ఎకరాల మేర అడవులు విస్తరించాయి. దట్టమైన అడవి, ఆహారానికి వన్యప్రాణులు ఉన్నా పులి మాత్రం కొన్నేళ్లుగా అతిథిలా వచ్చిపోతోంది.

మూడేళ్లుగా కన్పించక..

జిల్లా అటవీ ప్రాంతంలోని కిన్నెరసాని అభయారణ్యంలో మర్కోడు, రంగాపురం, అనంతోగు, మల్లెపల్లితోగు ప్రాంతాల్లో ఉన్న దట్టమైన అడవిలో పెద్ద పులుల సంచారం ఉండేది. ఛత్తీస్‌గఢ్ నుంచి గొత్తికోయలు వలస వచ్చి జిల్లా అటవీ ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో రెండు లక్షల ఎకరాలకు పైగా పోడు సాగు చేపట్టారు. చెట్ల నరికివేత, ఆక్రమణతో దట్టమైన అటవీ ప్రాంతం పలచపడింది. ఫలితంగా పులులు ఇక్కడ నివాసం ఉండలేక వలసబాట పట్టాయి. 2018లో జరిగిన పులుల గణనలో ఉమ్మడి జిల్లా అటవీ ప్రాంతంలో పులి సంచారం కన్పించలేదు. మళ్లీ 2020 డిసెంబర్, 2021 జనవరిలో పెద్దపులి కన్పించింది. కానీ ఇక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకోకుండానే తిరిగి వెళ్లిపోయింది. మళ్లీ ఈ ఏడాది ఫిబ్రవరిలో జిల్లా అటవీ ప్రాంతానికి వచ్చింది. అప్పటి నుంచి ఆరు నెలలుగా ఇక్కడే సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఈ పులికి భద్ర అని నామకరణం చేశారు. కాగా అలజడిలేని అడవిలో జింకలు, సాంబార్లు అధికంగా ఉన్న ప్రాంతంలోనే పులి సంచారం ఉంటుందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

ఇక్కడే ఉండేలా..



అభయారణ్యంలో దట్టమైన అడవి, ఆవాస యోగ్యం, వన్య ప్రాణులున్న ప్రాంతం రంగాపురం, మల్లెతోగు అటవీ ప్రాంతంలో అభివృద్ధిపై దృష్టి సారించాం. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మంజూరు చేస్తున్న కంపా స్కీమ్ నిధులతో నీటి కుంటలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, 200 హెక్టార్లలో గడ్డి క్షేత్రాలు, 86 సోలార్ పంప్‌లు, సాసర్ వెల్స్, 150 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నాం. పులి ఆహారమైన వన్య ప్రాణుల సంఖ్య కూడా పెరిగింది. భద్ర జిల్లా అడవిలోనే ఉండేలా ప్రయత్నిస్తున్నాం.

–కృష్ణాగౌడ్, జిల్లా అటవీశాఖాధికారి

కిన్నెరసాని కార్యదర్శికి సమాచార హక్కు కమిషన్ నోటీస్

పాల్వంచరూరల్: కిన్నెరసాని గ్రామపంచాయతీ కార్యదర్శికి సమాచార హక్కు కమిషన్ నోటీస్ జారీ చేసింది. మండల పరిధిలోని రాజాపురం గ్రామానికి చెందిన బుడగం సత్యనారాయణ 2023లో బీసీ కార్పొరేష్ రుణాల వివరాలు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. సకాలంలో సమాచారం ఇవ్వడం లేదని సత్యనారాయణ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ నెల 31న కలెక్టరేట్‌లో నిర్వహించే విచారణకు హాజరుకావాలని కార్యదర్శికి కమిషన్ నోటీస్ జారీ చేసింది.

ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

- పరీక్ష రాస్తుండగా ఫిట్స్, ఆస్పత్రికి తరలించగా కన్నుమూత
- న్యాయం చేయాలంటూ ఆస్పత్రి వద్ద ధర్నా



భూక్యా ప్రతిమ (ఫైల్)

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి గొల్లగూడెంలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థిని భూక్యా ప్రతిమ(15) సోమవారం మృతి చెందింది. కూసుమంచి మండలం బోడియాతండా గ్రామపంచాయతీ నామతండాకు చెందిన భూక్యా రమేష్ – బూబమ్మ కుమార్తె ప్రతిమ పదో తరగతి చదువుతోంది. మధ్యాహ్నం ఆమె ఎఫ్ఏ–1 సోషల్ పరీక్ష రాస్తుండగా ఫిట్స్ వచ్చాయి. దీంతో ఉపాధ్యాయులు పాఠశాలలోని ఏఎన్ఎంతో ప్రాథమిక చికిత్స చేయించాక ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగానే ప్రతిమ మృతి చెందింది.

న్యాయం చేయాలని ధర్నా

ప్రతిమ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మార్చురీకి తరలిస్తుండగా బంధువులు, తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తన కుమార్తె ఎలా చనిపోయిందో చెప్పాలంటూ ప్రతిమ తండ్రి రమేష్ స్ట్రెచర్‌కు అడ్డుగా పడుకున్నాడు. అంతలోనే విద్యార్థి సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో చేరుకుని ఆస్పత్రికి తరలించడంలో ఆలస్యంతోనే విద్యార్థిని మృతి చెందిందంటూ ఆందోళన చేపట్టారు. ఆమె కుటుంబానికి న్యాయం చేసే వరకు కదిలేది లేదని బైఠాయించగా పోలీసులు వారికి పక్కకు తొలగించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఆర్‌డీఓ నర్సింహారావు అక్కడికి చేరుకుని బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులతో చర్చించారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి బంధువులకు హామీ ఇచ్చారు.



విద్యార్థి సంఘాల నాయకులను పక్కకు తప్పిస్తున్న పోలీసులు

పాఠశాలలో డీడీ విచారణ

విద్యార్థి ప్రతిమ మృతి నేపథ్యాన గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మి ఆశ్రమ పాఠశాలలో విచారణ చేపట్టారు. ఉదయం నుంచి విద్యార్థిని ఎలా ఉందో ఆరా తీసిన ఆమె అక్కడి నుంచి ఆస్పత్రికి వచ్చి బంధువులతో మాట్లాడారు. అయితే, ఆస్పత్రిలో ప్రతిమను చేర్పించిన ఉపాధ్యాయులు అక్కడ లేకపోవడంపై బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఓపెన్ స్కూల్ వాల్ పోస్టర్లు ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ వాల్ పోస్టర్లను అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితుల కారణంగా పాఠశాల స్థాయిలోనే చదువు మానేసిన వారికి సొసైటీ మళ్లీ చదువుకునే అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందేందుకు ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాలు నిండిన వారు 10వ తరగతికి అర్హులని, 15 సంవత్సరాలు నిండి, పదో తరగతి ఉత్తీర్ణులైనవారు ఇంటర్‌కు అర్హులని వివరించారు. అపరాధ రుసుం లేకుండా జూలై 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఆగస్టు 1 నుండి 28 వరకు అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. పదో తరగతికి రూ.100, ఇంటర్‌కు రూ.200గా రిజిస్ట్రేషన్ రుసుము నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మద్దినేని పాపారావును 8008403522 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈకార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు, డీఎంహెచ్ఓ జయలక్ష్మి, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, పరిశ్రమల శాఖాధికారి పృథ్వీ పాల్గొన్నారు.

ఏజెన్సీకి గోదావరి జలాలు ఇవ్వాలి

నీటిపారుదల శాఖ మంత్రికి వినతిపత్రం



మంత్రి ఉత్తమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గుమ్మడి నర్సయ్య తదితరులు

ఇల్లెందు: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన ప్రాంతాలకు, నీటిసదుపాయం లేని మైదాన ప్రాంతాలకు గోదావరి జలాలను అందించాలని, రాజీవ్ సాగర్ ఎలైన్‌మెంట్ ప్రకారం నిర్మాణం చేపట్టి, రీ డిజైన్‌కు ముందున్న ప్రకారం నిర్మాణం చేయాలని గోదావరి జలాల సాధన కమిటీ కన్వీనర్ గుమ్మడి నర్సయ్య కోరారు. సోమవారం సెక్రెటేరియట్‌లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుమ్మడి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం 2005లో శంకుస్థాపన చేసిన ప్రకారం దుమ్ముగూడెం ప్రాజెక్ట్ నిర్మించాలని కోరారు. ప్రాజెక్ట్ డిజైన్ మార్చి జిల్లాకు చుక్క నీరు అందకుండా చేశారని ఆరోపించారు. అంతకు ముందు ఈఎన్‌సీని కూడా కలిసి వినతిపత్రం అందజేశారు. కాగా త్వరలో సమావేశం ఏర్పాటు చేసి అఖిలపక్షానికి సమాచారం ఇస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు గుమ్మడి తెలిపారు. పోరాట కమిటీ సభ్యులు బండారి మోహన్ రావు తదితరులు ఉన్నారు.

కూలిన రోళ్లపాడు కాలువ తొట్టి

వృథాగా పోయిన సాగునీరు



తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్న రైతులు

టేకులపల్లి: ఇటీవల కురిసిన వర్షాలతో ఆదివారం రాత్రి రోళ్లపాడు చెరువు ఎడమ కాలువ తొట్టి కూలింది. దీంతో సాగునీరు వృథాగా పోయింది. ఈ కాలువ ద్వారా అబ్బిరెడ్డిగూడెం, బేతంపూడి, బద్దుతండా, కుంటల్ల తదితర గ్రామాలకు చెందిన సుమారు నాలుగైదు వందల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. సోమవారం బాధిత రైతులు ఇసుక బస్తాలు, రాళ్ల అడ్డు పెట్టి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

కొత్తగూడెం సబ్‌రిజిస్ట్రార్‌గా అప్పారావు



బాధ్యతలు స్వీకరించిన అప్పారావు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం సబ్‌రిజిస్ట్రార్‌గా అప్పారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన వేణుమాధవ్ గత ఏప్రిల్ నుంచి సెలవులో ఉన్నారు. అప్పటి నుంచి గత వారం వరకు కిరణ్ బాధ్యతలు నిర్వర్తించారు. ఇటీవల కిరణ్ కూడా లీవ్‌పై వెళ్లడంతో అప్పారావును కరీంనగర్ నుంచి ఇక్కడికి బదిలీ చేశారు.

వ్యక్తి అదృశ్యం



బానోతు సూర్యం

టేకులపల్లి: వ్యక్తి అదృశ్యంపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకా రం.. మండలంలోని మద్రాస్ తండాకు సుతారి మేస్త్రీ బానోత్ సూర్యం ఈ నెల 10న సుతారి పనికి కొత్తగూడెం వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లేదు. సూర్యం భార్య శౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.

పశువులు స్వాధీనం

ఇల్లెందు: మండలంలోని కొమరారం ఏరియా నుంచి హైదరాబాద్ కబేళాకు తరలిస్తున్న 11 పశువులను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. 21 ఏరియాలో పశువుల వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస రెడ్డి తెలిపారు. పశువులను పాల్వంచ గోశాలకు తరలించారు.

పాముకాటుతో మహిళ మృతి



పొడియం లక్ష్మి(ఫైల్)

పాల్వంచరూరల్: పంట చేలో పాముకాటుకు గురై ఓ మహిళ మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనంప్రకారం.. మండలపరిధిలోని రెడ్డిగూడెం గ్రామపంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన పొడియం కోశయ్య, లక్ష్మి (45) దంపతులు గ్రామ శివారు అటవీ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేస్తున్నారు. పంట చేలోనే నిద్రించగా, సోమవారం తెల్లవారుజామున లక్ష్మిని విషసర్పం కాటు వేసింది. దీంతో భర్త, స్థానికులు కలిసి నాటు మందు వేశారు. అయినా నయంకాకపోవడంతో 108లో పాల్వంచ ఆస్పత్రికి తీసుకవెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పాము కాటువేసిన ఏడుగంటల తర్వాత ఆమె చనిపోయింది. తక్షణమే ఆస్పత్రికి తీసుకెళ్లకుండా నాటువైద్యం చేయించడంతో మృతిచెందినట్లు తెలుస్తోంది. కాగా మృతురాలికి భర్త, ఇద్దరుకుమారులుఉన్నారు. ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో ఆర్ఎంపీ..



రవికాంత్ (ఫైల్)

టేకులపల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ గ్రామీణ వైద్యుడు ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. టేకులపల్లిలోని పాత సినిమా హాల్‌బజార్‌కు చెందిన యనగంటి రవికాంత్(36) ఆదివారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో పెద్దశబ్దాలతో గురకపెట్టాడు. భార్య, తండ్రి గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతుడి తండ్రి అర్జున్‌రావు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు. మృతదేహాన్ని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కుమార్తె లక్ష్మీప్రసన్న తలకొరివి పెట్టి దహనసంస్కారాలు నిర్వహించింది. దహన సంస్కార ఖర్చుల నిమిత్తం ఎస్‌ఐ, మాజీ సర్పంచ్ ఇస్లావత్ రెడ్యానాయక్ ఆర్థిక సాయం చేశారు. మాజీ ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్, మాజీ సర్పంచ్ కోరం ఉమ తదితరులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: కుటుంబ కలహాలతో సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. మండల పరిధిలోని రేగులగూడెం గ్రామానికి చెందిన పడిగ సతీష్ పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి 108 ద్వారా పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్‌కు గాయాలు

కరకగూడెం: మండలంలోని భట్టుపల్లి నర్సరీ నుంచి డ్రైవర్ కణితి ప్రవీణ్ ట్రాక్టర్‌లో మణుగూరుకు మొక్కలు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో బంగారుగూడెం బ్రిడ్జి మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి ఓ గోతిలో పడింది. అటుగా వెళ్తున్నవారు గమనించి క్షతగాత్రుడిని పినపాక పీహెచ్‌సీకి తరలించగా, వైద్యులు ప్రథమ చికిత్స అందించారు.


దొంగకు దేహశుద్ధి

బూర్గంపాడు: మండల పరిధిలోని సారపాక గ్రామపంచాయతీ భాస్కర్‌నగర్‌లో సోమవారం మధ్యాహ్నం ఓ దొంగకు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పట్టపగలు ఓ ఇంటి ఆరుబయట నిలిపి ఉంచిన మోటార్ సైకిల్‌ను ఓ వ్యక్తి దొంగిలించి తీసుకెళ్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. దొంగకు దేహశుద్ధి చేసి అప్పగించగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసు నమోదు

దమ్మపేట: మండలంలోని బాలరాజుగూడెం గ్రామంలో సోమవారం బంగారం చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి పాయం పవన్‌కుమార్ పనిమీద దూర ప్రాంతానికి వెళ్లగా, అతడి భార్య వ్యవసాయ క్షేత్రానికి వెళ్లింది. దీంతో దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువా తెరచి బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించారు. ఆభరణాల విలువ రూ.2,30,000 ఉంటుందని బాధితుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

వర్షాలు.. సస్యరక్షణ



పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

- రసాయన ఎరువులు వినియోగించొద్దు
- పంటల రక్షణకు జాగ్రత్తలు పాటించాలి
- కేవీకే సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ భరత్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో రైతులు రసాయన (ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు) ఎరువులను వాడొద్దని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ టి.భరత్ తెలిపారు. వివిధ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

వరి

- నీటి ముంపుకు గురైన నారుమడులు, వరి పొలాల నుంచి నీటిని వెంటనే తొలగించాలి
- మరో రెండు రోజులు భారీ వర్ష సూచన ఉన్నందున పొలంలో నీటి కాలువలు ఏర్పాటు చేసుకోవాలి
- రైతులు వరి నాట్లను రెండు రోజులు వాయిదా వేసుకోవాలి
- ఇప్పటివరకు నారు పోయని రైతులు వర్షాలు తగ్గాక పొలాలను దమ్ము చేసుకుని నేరుగా విత్తే పద్ధతిలో స్వల్ప కాలిక (120–124 రోజుల) వరి రకాలను సాగు చేసుకోవచ్చు.

మొక్కజొన్న

- మొక్కజొన్న శాఖీయ దశలో ఎక్కువ నీటిని తట్టుకోలేదు. పొలం నుంచి నీటిని తక్షణమే తీసివేయాలి
- అధిక వర్షాలతో నేలలో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్నీ ఊదారంగులోకి మారే అవకాశం ఉంది. వర్షాలు తగ్గాక 5 గ్రా. 19:19:19 లేదా 20 గ్రాములు డీఏపీ మందును లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి

పత్తి

- వర్ష సూచన ఉన్నందున పత్తి చేలో నీటి కాలువలను ఏర్పాటు చేసుకోవాలి
- ముంపునకు గురైన పత్తి పంటలో వడలు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. మురుగు నీటిని పొలం నుంచి తీసివేసి పంట త్వరగా కోలుకోకునేందుకు వర్షాలు తగ్గిన తర్వాత 10 గ్రా. పాలీఫీడ్ (19:19:19) లేదా మల్టీ–కె (13–0–45) లేదా యూరియాతో పాటు 3 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా 2 గ్రా. కార్బెండజిమ్ + మ్యాంకోజెబ్ మందును లీటరుకు నీటిని కలిపి నేలా బాగా తడిచేలా మొక్క మొదళ్ల చుట్టూ పోయాలి.

కంది

- నీటి ముంపుకు గురైన కంది పంటలో ఫైటాఫ్తోర ఎండుతెగులు ఆశించే అవకాశం ఉంటుంది. దీని నివారణకు వర్షాలు తగ్గాక 2 గ్రాముల మెటలాక్సిల్ మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేలా మొక్క మొదళ్ల చుట్టూ పోయాలి

కలుపు మందు తగిన మోతాదులో..



పత్తి చేనులో పెరిగిన కలుపు

ఇల్లెందురూరల్: వారం రోజులపాటు కురిసిన అధిక వర్షాలతో పత్తి, మొక్కజొన్న చేలల్లో పైరుతోపాటు కలుపు మొక్కలు కూడా ఏపుగా పెరుగుతున్నాయి. దీంతో పంటకు నష్టం జరిగి దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు చేలల్లో కలుపు తీత పనులు చేపట్టారు. మరి కొందరు కలుపు మందు పిచికారీ చేస్తున్నారు. విచ్చలవిడిగా కలుపు మందులు పిచికారీ చేస్తే పంటనష్టపోయే అవకాశం ఉందని, తగిన మోతాదులో, పంటలపై పడకుండా పిచికారీ చేయాలని ఇల్లెందు వ్యవసాయశాఖ అధికారి సతీష్ సూచించారు. వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి జాగ్రత్తలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.